క్లుప్తంగా

నిమజ్జనాల వేళ జాగ్రత్త వహించండి

తాళ్లపూడి: గణపతి నవరాత్ర ఉత్సవాల నిర్వాహకులు వివాదాలకు తావు లేకుండా వేడుకలు జరుపుకోవాలని కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు సూచించారు. వివిధ ప్రాంతాల గణపతి ఉత్సవ కమిటీల నిర్వాహకులతో సోమవారం ఆయన మండలంలోని వేగేశ్వరపురం సచివాలయం వద్ద సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ విజయబాబు మాట్లాడుతూ గణపతి నవరాత్ర ఉత్సవాల సందర్భంగా గతంలో జరిగిన అవాంచనీయ ఘటనలు పునరావృతం కాకుండా అందరూ సహకరించాలన్నారు. విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేసేటపుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు, తాళ్లపూడి ఎస్సై రామకృష్ణ, సచివాలయ కార్యదర్శి నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా గణనాథుల సందడి

గణపతి నవరాత్ర ఉత్సవాలు పలు గ్రామాల్లో ఉత్సాహంగా సాగుతున్నాయి. మూడో రోజైన సోమవారం పలు గణనాథుల మంటపాల వద్ద వివిధ రకాల ప్రసాదాలను స్వామివారికి నివేదించాక, భక్తులకు పంపిణీ చేశారు.

ప్రిన్సిపాల్ ఉమాదేవికి సత్కారం



అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవిని సత్కరిస్తున్న దృశ్యం

గోపాలపురం: ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు గ్రహీత, ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్లూరి ఉమాదేవిని సోమవారం మానవత సేవాసంస్థ మండల శాఖ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ ఏటా టెన్త్, ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రిన్సిపాల్ ఉమాదేవి కృషి చేస్తున్నారని మానవత సంస్థ మండల శాఖ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, మండల శాఖ అధ్యక్షుడు పి. సత్యకృష్ణారెడ్డి కొనియాడారు. అనంతరం ప్రిన్సిపాల్ ఉమాదేవిని శాలువా, మెమెంటోతో అదే విద్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో దోమతెరల పంపిణీ



పెద్దాపురంలో దోమ తెరలు పంపిణీ చేస్తున్న దాత కొర్లపాటి అన్నవరం

గోపాలపురం: మండలంలోని పెద్దాపురం గ్రామంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు సోమవారం దోమతెరలు పంపిణీ చేశారు. అదే గ్రామానికి చెందిన దాత, ఉత్తమ వర్జీనియా పొగాకు రైతు అవార్డు గ్రహీత కొర్లపాటి అన్నవరం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల వద్ద వాటిని పంపిణీ చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల దోమలు పెరగడంతో దాత అన్నవరాన్ని వైద్య సిబ్బంది సంప్రదించారు. వారి విజ్ఞప్తి మేరకు ఆయన లోతట్టు ప్రాంతాల వారికి దోమతెరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గుబ్బా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పశువులకు ఉచితంగా వ్యాక్సిన్లు



ఎ.వెంకటరెడ్డి

కొవ్వూరు: భారీ వర్షాల నేపథ్యంలో పశువులకు వ్యాధులు ప్రబల కుండా ఉచితంగా టీకాలు వేస్తున్నామని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ఎ.వెంకటరెడ్డి సోమవారం తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి, చీడపారు వ్యాధి, గొంతువాపు వ్యాధులు రాకుండా అన్ని పశు వైద్యశాలల్లో వాక్సిన్ వేస్తున్నామన్నారు.

గుండెపోటుతో టీచర్ మృతి



తొర్లపాటి విజయలక్ష్మి(ఫైల్)

కొవ్వూరు: మండలంలోని ఐ.పంగిడి జెడ్పీ హైస్కూల్లో బయాలజీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న తొర్లపాటి విజయలక్ష్మి (61) ఆదివారం రాత్రి ధర్మవరంలోని తన స్వగృహంలో గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె మృతికి ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు, ఆ సంస్థ కొవ్వూరు మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, సలీం, పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఉషారాణి, వీరాస్వామిలతో పాటు ప్రధానోపాధ్యాయుడు మంగిన శ్రీరామారావు తదితరులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఇటు వర్షం.. అటు ఎర్ర కాలువ

- పౌర జీవనానికి అంతరాయం
- నందమూరు అక్విడెక్ట్ వద్ద ఎర్ర కాలువకు ఒకటో ప్రమాద హెచ్చరిక జారీ
- ముందస్తుగా ఐదు చోట్ల పునరావాస కేంద్రాలు



కంసాలిపాలెం వద్ద నీట మునిగిన వరి పంటను పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్న జేడీఏ మాధవరావు, మార్టేరు శాస్త్రవేత్త శ్రీనివాసరావు



నల్లజర్ల మండలం అనంతపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్ర కాలువ

కొవ్వూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో జన జీవనం స్తంభించింది. రెండు రోజులుగా ముసురు పట్టడంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని, జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు సోమవారం పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేశారు. సోమవారం ఉదయం నుంచి కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా చినుకులు పడుతూనే ఉన్నాయి. మధ్యాహ్నానికి కొంత అరుదల కనిపించింది. దేవరపల్లి మండలంలో గరిష్ఠంగా 45.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొవ్వూరు డివిజన్‌లోని అన్ని మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. మరో వైపు ఎర్ర కాలువలో వరద ప్రవాహ ఉధృతి పెరగడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. నందమూరు అక్విడెక్ట్ వద్ద సోమవారం ఉదయం ఆరు గంటలకు నీటిమట్టం 29 అడుగులకు చేరింది. దాంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. ఈ కాలువ నీటి మట్టం క్రమంగా 29.20 అడుగులకు పెరిగి వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం నాలుగింటికి నల్లజర్ల మండలం అనంతపల్లి సమీపంలో ఎర్ర కాలువ నీటిమట్టం 1.5 మీటర్ల వద్ద ఉందని అధికారులు తెలిపారు. ఇక్కడ కాలువ రెండు మీటర్ల ఎత్తుకు పైబడి ప్రవహిస్తే పంటలకు ముంపు ప్రభావం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కాగా నిడదవోలు మండలంలోని ముంపు ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.మాధవరావు, మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరావు పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు.

పరవళ్లు తొక్కుతున్న ఎర్ర కాలువ

ఎర్ర కాలువ పరవళ్లు తొక్కుతోంది. ఎగువన జంగారెడ్డిగూడెం మండలంలోని కొంగువారిగూడెం వద్ద గల ఎర్ర కాలువ జలాశయం నుంచి 4,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 83.50 మీటర్లు కాగా, ప్రస్తుత నీటిమట్టం 82.06 మీటర్లకు చేరుకుంది. ఎగువన క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 4,500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎర్ర కాలువ జలాశయం నుంచి నందమూరు అక్విడెక్ట్ సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ జలాశయం నుంచి మొదలయ్యే ఎర్ర కాలువ ప్రవాహంలో దిగువన పులివాగు, బయనేరు వంటి వాగులు కలుస్తాయి. అదీగాకుండా ఈ 60 కిలోమీటర్ల పొడవునా కాలువ పరీవాహక ప్రాంతాల్లో కురిసే వర్షపు నీరంతా కూడా ఎర్ర కాలువలోకే చేరుతుంది. దీంతో సోమవారం ఎర్ర కాలువలో 7,071 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుందని అధికారులు అంచనా వేశారు. కాలువ గట్ల పటిష్ఠతపై ఎప్పటికప్పుడు అధికారులు కింది స్థాయి సిబ్బందితో సమీక్షిస్తున్నారు.

పునరావాస శిబిరాలు

ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ముంపు బాధితుల కోసం అధికారులు నిడదవోలు మండలంలో ఐదు పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. రావిమెట్ల, కంసాలిపాలెం,శింగవరం, తాళ్లపాలెం, తిమ్మరాజుపాలెం గ్రామాల్లోని ఈ పునరావాస కేంద్రాల్లో జరుగుతున్న ఏర్పాట్లను నిడదవోలు మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్, తహసీల్దార్ నాగరాజు పర్యవేక్షించారు.

డివిజన్ వ్యాప్తంగా వర్షం

సోమవారం సాయంత్రం నాలుగు గంటలతో ముగిసిన 24 నాలుగు గంటల వ్యవధిలో కొవ్వూరు డివిజన్‌లోని అన్ని మండలాల్లోనూ ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాల వారీగా గోపాలపురం, దేవరపల్లిలో 36.8, చాగల్లులో 28.2, నల్లజర్లలో 29.8, పెరవలిలో 25.2, నిడదవోలులో 30.0, ఉండ్రాజవరంలో 27.6, తాళ్లపూడిలో 31.0, కొవ్వూరులో 22.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

గోటిపై గణనాథుని ప్రతిమ



గోటిపై వేసిన గణనాథుని చిత్రం

నిడదవోలు: పట్టణానికి చెందిన కుంచాల కైవల్యరెడ్డి అనే విద్యార్థిని వినాయకుడి చిత్రాన్ని గోటిపై వేసి అబ్బుర పరిచింది. ఇలా గోటిపై వేసే కళను నఖ చిత్ర కళ అంటారు. అంటే ఏ చిత్రాన్ని అయినా వేలిగోటి పరిమాణంలో సరిపోయేలాగా చిత్రించడం విశేషం. గణేశ్ చతుర్థిని పురస్కరించుకుని నఖంపై గణనాథుని చిత్రాన్ని కైవల్యరెడ్డి చిత్రీకరించింది.

పీహెచ్‌సీకి ఇన్సులిన్ సిరంజీల అందజేత

నల్లజర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నల్లజర్లకు చెందిన ఉన్నమట్ల సత్యకిరణ్ రూ.5 వేల విలువైన ఇన్సులిన్ సిరంజీలను సోమవారం డాక్టరు గంగాధరరావు, డాక్టర్ సిరాజుద్దీన్‌లకు అందజేశారు. కుక్కకాటు, పిల్లి కాటు, కోతి కాటు వంటి వాటికి ఇన్సులిన్ సిరంజీలు అవసరం. ప్రభుత్వ నుంచి సరఫరా లేకపోవడంతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించి సత్యకిరణ్ ఈ వితరణ చేశారు.

నీట మునిగిన పంట పొలాలు



చాగల్లులో ఉధృతంగా ప్రవహిస్తున్న పేములకాలువ



బ్రాహ్మణగూడెం వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

చాగల్లు: మూడు రోజులుగా మండలంలో వర్షాలు కురుస్తుండడంతో పౌర జీవనానికి అంతరాయం ఏర్పడింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకూ మండలంలో 26.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు గ్రామాల్లో పంట చేలు నీట మునిగాయి. నిడదవోలు–పంగిడి ఆర్ అండ్ బీ రహదారిపై చాగల్లు శివార్లలోను, ఊనగట్ల వద్ద వర్షపు నీరు చేరింది. మండలంలో పేముల కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. బ్రాహ్మణగూడెం రావుల చెరువు, ఊనగట్ల పాపయ్య చెరువు, ఊర చెరువులతో సహా పలు చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. నందిగంపాడు, చాగల్లు శివార్లలోని గరప్పాడు, ఊనగట్ల, మార్కొండపాడు, దారవరం గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో పంట పొలాల్లో నీరు చేరింది.

వసతి గృహంలోకి వర్షపు నీరు

- బిక్కుబిక్కుమంటూ విద్యార్థుల కాలక్షేపం
- పెచ్చులుగా ఊడి పడుతున్న శ్లాబ్ పై కప్పు
- వర్షపు నీటి మధ్య గోపాలపురం హైస్కూల్



దేవరపల్లి మండలం యర్నగూడెంలో బాలుర వసతి గృహంలోకి చేరిన వర్షపు నీరు



గోపాలపురం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో చేరిన వర్షపు నీరు



యర్నగూడెం బాలుర వసతి గృహం ఎదుట రోడ్డుపై నిలిచిన డ్రైనేజీ నీరు



బాలుర వసతి గృహంలోకి నీరు చేరడంతో వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా మెట్ట ప్రాంతమైన గోపాలపురం నియోజకవర్గంలోని గల నాలుగు మండలాల్లో వర్షాలు కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షాలకు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం పూర్తిగా నీట మునిగింది. వసతిగృహం ఆవరణలో నీరు చేయడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గదులు నీరు కారుతున్నాయి. శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో విద్యార్థులు భయంతో వణికిపోతున్నారు. గదుల్లో ఉండే పరిస్థితి లేక ప్రధాన గేటు వద్ద వరండాలో చదువుకుంటున్నారు. వసతిగృహం చుట్టూ మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్గంధం వ్యాపిస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. ఈ వసతిగృహంలో 31 మంది విద్యార్థులు ఉన్నారు. గోపాలపురం జిల్లా పరిషత్ హైస్కూల్ వర్షపునీటి మధ్యలో ఉంది. భారీ వర్షాలకు స్కూలు ప్రాంగణంలో మోకాళ్ల లోతు నీరు చేరింది. మరుగుదొడ్లు వర్షపునీటిలో ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

జూనియర్ డీవీకి స్వర్ణ సింహతలాటం

తొడిగి సన్మానించిన చాగల్లు వినాయక వర్తక సంఘం



జూనియర్ డీవీ సుబ్బారావుకు స్వర్ణ సింహ తలాటం తొడుగుతున్న కమిటీ సభ్యుడు

చాగల్లు: ప్రముఖ పౌరాణిక రంగస్థల నటుడు, అభినవ హరిశ్చంద్రుడినిగా పేరొందిన జూనియర్ డీవీ సుబ్బారావుకు చాగల్లు సంపత్ వరసిద్ధి వినాయక స్వామి వర్తక సంఘం గణపతి నవరాత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 'స్వర్ణ సింహ తలాటం' తొడిగి ఘనంగా సన్మానించింది. గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి ఇక్కడ 'సత్య హరిశ్చంద్ర' పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. సత్యహరిశ్చంద్ర నాటకంలో హరిశ్చంద్రుడినిగా, గయోపాఖ్యానంలో అర్జునుడిగా, దేవనర్తకి నాటకంలో భవానీ శంకరునిగా జూనియర్ డీవీ ఎంతోకాలంగా పలు వేదికలపై సత్తా చాటుతున్నారు. ముఖ్యంగా ఆయన ఏపీ, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో పలు ప్రదర్శనలు ఇచ్చి గొప్ప రంగస్థల కళాకారుడిగా పేరొందారు. ఈ నేపథ్యంలో చాగల్లు, నేలటూరు వర్తక సంఘ భవనంలో ఉత్సవ కమిటీ సభ్యులు గ్రంధి రాంబాబు, గంగారావు తదితరుల ఆధ్వర్యంలో డీవీ సుబ్బారావు, మౌనిక దంపతులను గజమాలలు, శాలువాలు, నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. డీవీ చేతికి ప్రత్యేకంగా స్వర్ణ సింహ తలాటం తొడిగారు.

మొక్కుబడిగా పునరావాస కేంద్రాల నిర్వహణ

- నిడదవోలు జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు ఆగ్రహం
- కంసాలిపాలెం, రావిమెట్ల శిబిరాల పరిశీలన



రావిమెట్లలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు

నిడదవోలు రూరల్: ఎర్ర కాలువ ముంపు ప్రభావిత గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల నిర్వహణ తూతూమంత్రంగా ఉందని జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు మండిపడ్డారు. మండలంలోని రావిమెట్ల, కంసాలిపాలెం, శెట్టిపేటలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్. తహసీల్దార్ నాగరాజు నాయక్‌లు ఉదయం పూట క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వచ్చినపుడు పునరావాస కేంద్రాల వద్ద విధులు నిర్వహించే గ్రామస్థాయి అధికారులు ఫొటోలు తీయించుకుంటున్నారని, మండల స్థాయి అధికారులు వెళ్లిన తరువాత అందుబాటులో ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పరిశీలనలో కంసాలిపాలెం పునరావాస కేంద్రం ప్రత్యేకాధికారి, ఉపాధిహామీ ఏపీఓ ఎ.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఆర్.వినయ్‌కుమార్, రావిమెట్లలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ మేకా శివతేజతో పాటు మరికొంత మంది ఉద్యోగులు మధ్యాహ్న సమయంలో కేంద్రాల వద్ద కనిపించలేదన్నారు. ఆరోగ్య సిబ్బంది మాత్రం యథావిధిగా ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారని సూరిబాబు చెప్పారు. పునరావాస కేంద్రాల వద్ద విధులకు డుమ్మా కొడుతున్న ఉద్యోగులపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని జెడ్పీటీసీ సూరిబాబు తెలిపారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి



నిడదవోలు గణేశ్ చౌక్ వద్ద సినీ గీతాలు ఆలపిస్తున్న గాయకులు, గాయనీమణులు

నిడదవోలు: గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా స్థానిక గణేశ్ చౌక్‌లోని శ్రీ పూజాగణపతి కుమారస్వామి ఆలయం వద్ద సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన రాక్ స్టార్ సినీ మ్యూజికల్ నైట్ శ్రోతలను అలరించింది. సాయంత్రం వర్షం తెరిపి ఇవ్వడంతో ప్రజలు భారీఎత్తున తరలి వచ్చి పాటలు వింటూ ఆనందించారు. భక్తి గీతాలతో పాటు కళాకారులు సినీ గీతాలను కూడా ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, కన్వీనర్ కారింకి నాగేశ్వరరావు, తోలేటి కోటేశ్వరరావు, సరిదే సత్యం, లక్కంసాని సూర్యరావు, ఎం.గంగారావు, దుళ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు తెలగా సంఘం ఆధ్వర్యంలో..

చాగల్లు: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక తెలగా సంఘం ఆధ్వర్యంలోని గంద్రోతు కృష్ణారావు కల్చరల్ ఆడిటోరియంలో జెమిని సినీ మ్యూజికల్ నైట్ నిర్వహించారు. గాయనీ గాయకులు పాడిన గీతాలు శ్రోతలను ఉత్సాహ పరిచాయి.మ్యూజికల్ నైట్ నిర్వాహకుడు జెమిని, మధు తదితరులు పాడిన పాటలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. మండలంలో పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. ఎస్ ముప్పవరంలో వినాయకుడిని డప్పు వాయిద్యాలతో ఊరేగించి నిమజ్జనం చేశారు. ఊనగట్లలో ప్రతిష్ఠించిన వినాయకుడి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. తీన్‌మార్ డప్పులు, బుట్ట బొమ్మలతో స్వామివారిని గ్రామంలో ఊరేగించి నిమజ్జనం చేశారు.మల్లవరంలో కూడా గణపతి విగ్రహాల ఊరేగింపులు నిర్వహించి నిమజ్జనాలు చేశారు.

మానసిక దివ్యాంగులకు పండ్లు, భోజనాలు



భోజనాలు చేస్తున్న మానసిక దివ్యాంగులు

ఉండ్రాజవరం: వైఎస్సార్ సీపీ నాయకుడు ఆలపాటి నరేంద్ర పుట్టిన రోజు సందర్భంగా సోమవారం పాలంగి గ్రామంలోని స్పందన మానసిక దివ్యాంగుల కేంద్రంలోని దివ్యాంగులకు పండ్లు, భోజనాలు అందజేశారు. మోర్త గ్రామానికి చెందిన చిటికెన శ్రీను (కేశవ శ్రీను), కొనకల్ల అంజనేయులు, చిటికెన దుర్గాప్రసాద్, మిద్దే ప్రసాద్ ఆర్థిక సహకారంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిటికెన సుజని, వైస్ సర్పంచ్ దాపర్తి రాంసందీప్, ఎంపీటీసీ సభ్యురాలు జానీ నాగలక్ష్మి, వెలిగట్ల రాణి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చిటికెన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

నిడదవోలు: పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, నిరుద్యోగుల కోసం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌కు అనుబంధంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు జువ్వల రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పట్టణం, పరిసర ప్రాంతాల అంబేడ్కర్‌వాదులు, దళిత మేధావులు, ఉద్యోగుల సహకారంతో ఈ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ భవనాన్ని నిర్మించారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ కమ్యూనిటీ హాల్‌ను వివాహాలు, ఫంక్షన్ల వంటి వాటి కోసం వ్యాపార ధోరణిలో నిర్వహిస్తున్నారని రాంబాబు అన్నారు. అలా కాకుండా దళిత సాంస్కృతిక, విజ్ఞాన కేంద్రంగా విరసిల్లాలని, భావితరాలకు పరిశోధన కేంద్రంగా ఉపయోగపడాలని సూచించారు.

అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే కఠిన చర్యలు

కొవ్వూరు టౌన్ సీఐ విశ్వం హెచ్చరిక



కొవ్వూరు: వినాయక చవితి వేడుకల్లో భాగంగా అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విశ్వం హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాల అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న నిర్వాహకులు మైక్, లైటింగ్, మునిసిపల్, ఫైర్, విద్యుత్ శాఖల నుంచి కూడా అనుమతులు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. పట్టణ స్టేషన్ పరిధిలో ఎక్కడైనా అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇలాంటి నృత్యాలకు సహకరించిన వాహన యజమానులను, డ్రైవర్లను మైక్, లైటింగ్ వేసిన వారిని సైతం బాధ్యులను చేస్తామని ప్రకటించారు. గణేశ్ విగ్రహాల నిమజ్జనం సమయంలోను ఎలాంటి అశ్లీల నృత్యాలు చేయకూడదన్నారు.

ముంపు నుంచి పంటలు ఇలా కాపాడుకోండి



సింగవరంలో ఎర్ర కాలువ ముంపు బాధిత రైతులతో మాట్లాడుతున్న జేడీఏ మాధవరావు, శాస్త్రవేత్త శ్రీనివాసరావు

నిడదవోలు రూరల్: తమ పంటలు ఎర్ర కాలువ ముంపు బారిన పడకుండా కాపాడుకునేందుకు రైతులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు సూచించారు. మండలంలోని సింగవరం, కంసాలిపాలెం గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను జేడీఏ మాధవరావు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు రైతులకు వారిద్దరూ పలు సూచనలు ఇచ్చారు. పంటపొలాల్లో నీరు తగ్గిన వెంటనే ఎకరాకు 10 కేజీల యూరియా, 25 కేజీల పొటాష్ వేయాలని రైతులకు సూచించారు. పొడ తెగులు రాకుండా ఎకరాకు 400 మిల్లీలీటర్ల హెక్సాకోనాజోల్ మందును పిచికారీ చేయాలన్నారు. ఏవో జి.సత్యనారాయణ, స్థానిక రైతులు పాల్గొన్నారు.